క్లుప్తంగా

వాహనాల తనిఖీ



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, ట్రాలీ, జీపులు, ఆటోలు, కార్లను ఆపి తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలు ఆపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారించి వదిలిపెట్టారు.

కస్తూరిబాలో ఆకస్మికంగా..



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహాన్ని శనివారం డీఈఓ కార్యాలయ ఏఎంఓ, ఎఫ్ఏఓ సారయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాలను సందర్శించి పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతిలో వందశాతం రిజల్ట్ సాధించేలా విద్యార్థులకు పలు సూచనలను చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడోరోజు సాగిన శిక్షణ



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని శ్రీనగర్‌లో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఐదు అంశాలపై శిక్షణ సాగింది. ఓడీఎఫ్ సుస్థిరత, ఘన వ్యర్థాల తొలగింపు, మురుగునీరు, ప్లాస్టిక్ నిర్మూలన, విజెవల్ క్లీన్‌నేస్ వంటి అంశాలపై సమస్యలను గుర్తించి పరిష్కారం చూపేలా సర్వే చేసి స్వచ్ఛత ప్లాన్ డీఆర్‌డీఓ కార్యాలయానికి పంపాలని ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు పాక శ్రీనివాస్, ఐఈసీ శ్రీనివాస్, ఎంఐఎస్ కుమార్, టీపీ సురేష్, ఏపీఓ సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పొడేటి దయాకర్ అధ్యక్షతన శనివారం ఎస్సై దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, సర్పంచ్ యశోదబాబులు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) డైరీని ఆవిష్కరించారు.

చెక్కుల పంపిణీ

రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని కొండూరు, ఆర్ఆర్‌కాలనీ, ఏకే తండా, బాలాజీ తండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి శనివారం పంపిణీ చేశారు. మూనావత్ నర్సింహానాయక్, ఆకుల సురేందర్‌రావు, రామచంద్రారెడ్డి, పూస మధు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన తూటి సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుడి చిత్రపటానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర ఆర్‌బీఎస్ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, వేములపెల్లి రాజుకుమార్, నాయకులు ఉన్నారు.

సన్మానం

నల్లబెల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రేలకుంటలో శనివారం అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ క్రీడోత్సవాలను సర్పంచ్ సర్పంచ్ రత్నాకర్ రావు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నల్లబెల్లి, రుద్రగూడెం సెక్టార్ సూపర్‌వైజర్లు కొత్తపల్లి ఝాన్సీరాణి, శ్యామల దేవిని ఘనంగా సన్మానించారు.

ఇద్దరిపై కేసు

ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన సంధ్యకు ఆమె అత్త సుహాసిని మధ్య గొడవ జరిగింది. దీంతో కోపానికి గురైన అత్త, శుక్రవారం కోడలిపై వేడి నీళ్లు పోసి గాయపరిచిన విషయం విదితమే. దీంతో సంధ్య తల్లి కనకతార ఫిర్యాదు మేరకు సుహాసినిపై హత్యయత్నం, భర్త ప్రేమ్ చందుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

పీపీగా రవీందర్‌రావు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని రోళ్లకల్ గ్రామానికి చెందిన గుజ్జ రవీందర్‌రావు శనివారం పీపీగా బాధ్యతలు స్వీకరించారు. రవీందర్‌రావు జిల్లా ఫ్యామిలి కోర్టు రెండో అడిషనల్ సెషన్స్ కోర్టు నుంచి పీపీగా బాధ్యతలు స్వీకరించినందుకు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెల పంపిణీ ఎప్పుడో?

- నిరీక్షిస్తున్న గొల్ల,కురుమలు
- రెండో విడతకు 1,020మంది అర్హులు



ఖానాపురం : గొల్ల, కురుమలకు తెలంగాణ ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెల పథకం అందని ద్రాక్షలా మారింది. మొదటి విడత పంపిణీ చేసి సంవత్సరాలు గడుస్తున్నా రెండోవిడతకు మోక్షం లభించడం లేదు. దరఖాస్తులన్ని పశువైద్య అధికారుల చేతుల్లో ఉన్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఆశతో ఎదురు చూస్తున్న పరిస్థితి.

కుల వృత్తులను ప్రోత్సహిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో మొదటి విడతలో లబ్ధిదారులను ఎంపిక చేసి, పంపిణీ చేశారు. రెండో విడత కోసం కూడా అర్హులైన గొల్ల, కురుమల నుంచి దరఖాస్తులను తీసుకుంది. దీంతో మొదటి విడతలో ఖానాపురం మండలంలో 993మంది అర్హులకు 21గొర్రెల చొప్పున అందజేశారు. మొదటి విడతలో గొర్రెలు తీసుకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తుండగా, రాని వారు మరో విడత కోసం ఆశ పడుతూ వచ్చారు. రెండో విడతలో భాగంగా ఖానాపురం మండల వ్యాప్తంగా 1,020మంది అర్హులకు గొర్రెలు రావాల్సి ఉంది. కానీ కొంత కాలంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు కూడా సమాధానం చెప్పలేక పోతున్నారు. రెండోవిడత పంపిణీ చేస్తారా.. లేదా అనే సందిగ్ధంలో లబ్ధిదారులు ఉన్నారు.

ప్రభుత్వం స్పందించాలి



మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్నా. ద్రాతీయగా అందులో నా పేరు రాలేదు. రెండో విడత జాబితా జారీ చేశారు. దీంతో గొర్రెల కోసం నాటి నుంచి ఎదురు చూస్తూనే ఉన్నాం. అధికారుల వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని చెబుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గొర్రెలు పంపిణీ చేయాలి.

\- గుండా రవి, ధర్మారావుపేట

ఆదేశాలు రాలేదు



రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రెండో విడత కోసం 1,020దరఖాస్తులు గతంలోనే తీసుకున్నాం. మొదట ఏ, బీ పద్ధతిలో డ్రాలు వేసి తీసుకున్నారు. రెండో విడతలో రావాల్సిన వారు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే దరఖాస్తు దారులకు తెలియజేస్తాం.

\- శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి ఖానాపురం

పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి



నర్సంపేట: ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నర్సంపేట : శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆలయ పునఃనిర్మాణ కరపత్రాలను ఆలయ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ.. నర్సంపేట ప్రజలందరూ ఆలయ పునఃనిర్మాణంలో భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, శివాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి, మెరుగు లక్ష్మణ్‌బాబు, పురోహితులు శ్రీరామానుజాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

నర్సంపేటలోని ద్వారకపేట శ్రీ వేణుగోపాల వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా గంధం నరేందర్ గుప్తా, ఉపాధ్యక్షులుగా నంద్యాల సురేష్‌రెడ్డి, భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శి బూరుగు సాంబయ్య గౌడ్, కోశాధికారి మోతె నరేందర్‌రెడ్డి, ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులుగా నంగునూరి వినోద్‌రావు (ఆలయ స్థల దాత), ఆలయ గౌరవ సలహాదారులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆయా ఆలయాల చైర్మన్లు, అర్చకులతో కలిసి ఎన్నుకున్నారు. అనంతరం ఆలయ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అనంతరంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ నూతన నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన పెర్వారం సత్యవతి–యాదగిరి, అశ్విని–రతన్‌బాబు, తిరుపతిలు రూ.1,00,116లను అమూల్య జ్ఞాపకార్థం ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి దేవేందర్, టీఆర్ఎస్ నాయకులు రతన్, తిరుపతి, వెంకన్న, యాకయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగిన మహిళా క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి మహిళా క్రీడోత్సవాల్లో దుగ్గొండి టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఖోఖోలో ప్రథమ స్థానం నెక్కొండ, తాడు లాగుటలో చెన్నారావుపేట టీమ్‌లు గెలుపొందాయి. ఈ మేరకు గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు సజావుగా సాగేందుకు కృషి చేసిన ఎంపీఎంలు, పీఈటీలు, నిర్వాహకులు, మహిళా సమాఖ్య బాధ్యులు, ఆయా మండలాల ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారతను పెంపొందించేందుకు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, ఏసీపీ సంపత్‌రావు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపల్లి చిన్నబుచ్చుకుంది

నల్లబెల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ క్రమం నల్లబెల్లి మండలానికి చెందిన కబడ్డీ జట్టు దుగ్గొండి మండలం జట్టుపై 5 పాయింట్ల తేడాతో గెలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. దుగ్గొండి జట్టు సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులు గెలిచిన క్రీడాకారులను అభినందించారు. విజేతగా ప్రకటించిన పదినిమిషాలకు నల్లబెల్లి మండల జట్టులో బుచ్చిరెడ్డిపల్లి క్రీడాకారులతో పాటు సమీప గ్రామంలోని మూడుచెక్కలపల్లి క్రీడాకారులు పాల్గొన్నారని అభ్యంతరం వ్యక్తంచేస్తూ నల్లబెల్లి టీమ్‌ను ఎలిమినేట్ చేసి, ఓడిపోయిన దుగ్గొండి టీంను విజేతగా ప్రకటించారు. దీంతో నిర్వాహకుల తీరుపై నల్లబెల్లి క్రీడాకారులు అభ్యంతరం తెలిపారు. ఎంతకు వారు వినకపోవడంతో అసంతృప్తి చెందిన క్రీడాకారులు వెనుతిరిగామని తెలియజేశారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

రాయపర్తి : మండలంలోని కొండూరు పరిధిలోని భోజ్యానాయక్‌తండాకు చెందిన గుగులోత్ రవి ఇటీవల మృతిచెందాడు. కాగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున రూ.2లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును మృతుడి భార్య విజయకు ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తకు అండగా బీమా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిర్ర ఉపేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గీసుకొండ : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి రాంపురం వైపు చివరి వరకు రూ.60లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్ దౌడు బాబు శనివారం ప్రారంభించారు.

గ్రామ కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఆకులపల్లి ఉప్పలయ్య తెలిపారు. అధ్యక్షుడిగా ఇసంపల్లి ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా జిల్లా రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా మట్టెవాడ ఇస్మాయిల్, అధికార ప్రతినిధి చేతల రాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ముగ్గురిపై కేసు, ఇద్దరికి జరిమానా



అధికారులకు రసీదు అందిస్తున్న నరేష్, రాంబాబు

నల్లబెల్లి : మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు నందిగామకు చెందిన దివ్య, మధుకర్, బాలుపై కేసు నమోదు చేయగా, గతంలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన భూక్యా నరేష్, పోరిక రాంబాబులను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వీరు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో తహసీల్దార్ మంజుల ఎదుట హాజరుపరిచారు. కాగా నిబంధనలు ఉల్లంఘించిన వీరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఇద్దరు రెండు లక్షల రూపాయలు ప్రభుత్వ ఖాతాలో జమచేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

సంగెం : మండలంలోని పల్లారుగూడలో శనివారం గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు డబ్బును క్రమ పద్ధతిలో ఖర్చులు చేస్తు పొదుపులు పాటిస్తేనే ఆర్థిక క్రమశిక్షణ కలుగుతుందన్నారు. ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్షబీమా, అటల్ పెన్షన్ యోజన వాటిలో చేరాలని సూచించారు. గ్రామానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ప్రమాదబీమా చెక్కు బాధిత కుటుంబానికి అందజేశారు. సహజ మరణం పొందిన శ్రీరాముల తులసిరామ్, పోడేటి అజయ్ కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కక్కెర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ రఘు, బ్యాంకు మేనేజర్ స్వాతి, సిబ్బంది భాస్కరచారి, స్రవంతి, జతురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట : సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో శనివారం పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, జక్కుల జగదీశ్వర్, రమేష్, బొజ్జ విజయ్, ప్రదీప్, వల్ల వేణు, గణేష్, కృష్ణమోహన్, కందిక నవీన్, విష్ణు, సృజన, పద్మ, స్వప్న, కవిత, రోజా, సంధ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వరంగల్ (పర్వతగిరి) : విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఆర్డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ సూచించారు. మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల, కళాశాలలో శనివారం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ రాజు, ఏఓ ఏకాంబ్రం, రమేష్, శ్రీలత, సునీత, రమేష్, మహేందర్, భిక్షపతి, సత్యనారాయణ, శ్రీరామమూర్తి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు



నల్లబెల్లిలో..

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకుడు అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శనివారం గ్యాస్ సిలిండర్‌ను రోడ్డుపై పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగగా దానికి తోడు వంట గ్యాస్ ధరలను పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోడెం సారంగం, ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకులు జవహర్‌లాల్, మనోహరచారి, రాజేందర్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు గట్టికొప్పుల రవి, బిగిని రవి, ధరావత్ ఈర్య, భాస్కర్ పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి దామ సాంబయ్య డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు అంగడి పుష్ప, మార్తా నాగరాజు, జయలక్ష్మి, లక్ష్మి, లలిత శివాణి, రాణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వర్ధన్నపేట: మెమొంటోలతో విద్యార్థులు



నర్సంపేట: ఉపాధ్యాయులతో విద్యార్థులు



నల్లబెల్లిలో..



గీసుకొండ: ధర్మారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



నెక్కొండ: ఉపాధ్యాయులతో విద్యార్థులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 150మంది విద్యార్థులు పాల్గొనగా ప్రిన్సిపాల్‌గా బి.శరద్యుతి, కరస్పాండెంట్‌గా కుమార్ ఎస్.ఠౌర, డీఈఓగా ఐమన్ సుబియా, ఎంఈఓగా బి.కీర్తి, డాక్టర్లుగా ఆఫ్రాహర్మైన్, పి.ఇందుజ, కుమార్, బి.రాజేష్, ఇతర విద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్లము, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్ర పాఠాలు బోధించారు. అనంతరం ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, అకాడమిక్ ఇన్‌చార్జ్ రహీమొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెక్కొండ విద్యోదయ పాఠశాలలో..

నెక్కొండ : మండలంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను అనుకరిస్తూ పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించామని కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. డీఈఓగా దిల్‌సుక్ నాయక్, డిప్యూటీ డీఈఓగా సాయిప్రియ, ఎంఈఓగా శ్రీవాణి, సీఈఓగా జశ్వంత్, ప్రిన్సిపాల్‌గా అజిత్, వైస్ ప్రిన్సిపాల్‌గా శ్రీజలతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ షరీఫ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. డీఈఓగా రచన, ఎంఈఓగా అనన్య, హెచ్ఎంగా ముజాహిద్‌లు వ్యవహరించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం కుమారస్వామి, ఎస్ఎంసీ కోఆప్షన్ మెంబర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. డీఈఓగా కావ్య, ప్రధానోపాధ్యాయులుగా లోకేశ్వరి వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, ప్రధానోపాధ్యాయుడు రామస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబెల్లి పాఠశాలలో..

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎంగా బిర్రు హానిక, డీఈఓగా శ్రీపాది రితికతో మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ విధులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ మేకల రాములు, ఉపాధ్యాయులు గణేష్, సదానందం, ఉపేందర్, పరిపూర్ణాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్గనైజేషన్ బాధ్యులు

నర్సంపేట : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు గొంగ్లె అశోక్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని శాంతినగర్ సంఘమిత్ర బాలభవన్‌లో తలసేమియా బాధిత చిన్నారుల కోసం సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్, యువనేతాజీ ఫౌండేషన్ వరంగల్ సంయుక్తంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 40మంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘమిత యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తోట రవి, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, బ్లడ్ మోటివేటర్, పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అలవాల తేజస్వి, ఉపాధ్యక్షులు చేపూరి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

చెన్నారావుపేట : రోజు రోజుకు పెరుగుతున్న మోటర్ల దొంగతనాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల పలు గ్రామాలలో వ్యవసాయ మోటర్లతో పాటు ఇంటి ఆవరణలలో ఉన్న మోటర్లు అపహరణకు గురైన సంఘటనలు ఉన్నాయి. కాగా రెండు రోజుల క్రితం దేశ్లా తండాకు చెందిన ఓ రైతు మోటరు అపహరణకు గురికాగా మండలంలోని శంకరం తండాలో శనివారం మరో మోటర్ అపహరించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇదే తండాకు చెందిన జర్పుల బాలు తన వ్యవసాయ బావి సమీపంలోని మొక్కజొన్న పంటకు నీరు పారిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటర్‌తో పాటు పైపులను కూడా ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆవేదనతో తెలిపాడు. దీంతో రూ. 30 వేల నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వరుసగా జరుగుతున్న మోటర్ల దొంగతనాలపై నిఘా ఏర్పాటు చేసి దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు రైతులు కోరుతున్నారు.